సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 17 । జనవరి । 2024



సీటొస్తే నవోదయమే

ఉన్నత విద్యా ప్రమాణాలతో, ఉజ్వల భవిష్యత్తును అందించే జవహర్ నవోదయ విద్యాలయలో ప్రవేశానికి ఈ నెల 20న పరీక్ష నిర్వహిస్తున్నారు.

8లో




చార్జీల బాదుడుపై కొరడా

సంక్రాంతి పండగను క్యాష్ చేసుకుంటున్న ప్రైవేట్ ట్రావెల్స్‌పై రవాణా శాఖ కొరడా ఝుళిపించింది. కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించింది.

8లో

డెల్టాలకు 8,300 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు మంగళవారం 8,300 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 2,000, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.30 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరాలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో బుధవారం పలు అర్బన్ పీహెచ్‌సీల్లో జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. కొవ్వూరు ఇందిరమ్మ కాలనీ క్రిస్టియన్‌పేట యూపీహెచ్‌సీ, నిడదవోలు టక్కరి బాబాపేట పరిధి నెహ్రూ నగర్ యూపీహెచ్‌సీ, రాజమహేంద్రవరం బత్తిన నగర్ అద్దేపల్లి కాలనీ యూపీహెచ్‌సీ, లలితా నగర్–1 ఆనంద్ నగర్ యూపీహెచ్‌సీ, ఆర్‌పీ నగర్ సారంగధరమెట్ట యూపీహెచ్‌సీ, నెహ్రూ నగర్ కంబాలపేట యూపీహెచ్‌సీలో ఈ శిబిరాలు జరుగుతాయని వివరించారు. ఈ వైద్య శిబిరాలను ఆయా వార్డు సచివాలయాల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైన్స్ లిటరేచర్ ఫెస్టివల్‌కు సందీప్‌శర్మ



తాతా సందీప్‌శర్మ

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో నగరానికి చెందిన ప్రముఖ శతావధాని, సైన్స్ పరిశోధకుడు తాతా సందీప్ శర్మ వక్తగా పాల్గొనున్నారు. విజ్ఞాన భారతి, హర్యానా ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ సంయుక్త నిర్వహణలో ఫరీదాబాద్‌లోని రీజినల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ వేదికగా ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకూ ఈ కార్యక్రమం జరగనుంది. ఇందులో భాగంగా ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించే సైన్స్ లిటరేచర్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు తనకు మంగళవారం ఆహ్వానం అందిందని సందీప్‌శర్మ తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయం బయో టెక్నాలజీ విభాగంలో ఆచార్య జి.సుధాకర్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేస్తున్నారు.

జాతీయ సదస్సుకు మంగారాణి ఎంపిక



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఢిల్లీలోని విశ్వ యువ కేంద్రలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు స్థానిక నాగరాజా స్పెషల్ నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని మోటూరి మంగారాణి ఎంపికయ్యారు. నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్‌షిప్ కార్యక్రమం ద్వారా పాఠశాల నాయకత్వాన్ని గుర్తించి, సెలబ్రేటింగ్ స్కూల్ లీడర్‌షిప్ రెగ్యులర్ ఫీచర్‌లో భాగంగా ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకూ ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. జాతీయ విద్యా విధానంలో 2020 నుంచి వచ్చిన ఇన్‌పుట్‌ల ఆధారంగా పాఠశాల సంపూర్ణ అభివృద్ధి, పరిసరాలు, సమర్థ నాయకత్వం అనే అంశంపై ఈ సదస్సు జరుగుతుంది. దీనికి దేశవ్యాప్తంగా 400 వ్యక్తిగత అధ్యయనాలు, 30 పరిశోధన పత్రాలు అందగా రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. వారిలో మంగారాణి ఒకరు. ఆసక్తికరమైన తరగతి లైబ్రరీ నిర్వహణ, దాతల ద్వారా పాఠశాల అభివృద్ధి, మెరుగైన సామాజిక కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాల్లో మంగారాణి ముందున్నారు. ఆమెను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాపరెడ్డి, జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈవీబీ నారాయణ, జిల్లా సమగ్ర శిక్షా ఏఎంఓ గారిశంకర్, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, అర్బన్ ఎంఈఓ–2 రమారజని తదితరులు అభినందించారు.

సత్యదేవుని దర్శించిన జస్టిస్ చక్రవర్తి



సత్యదేవుని సన్నిధిలో జస్టిస్ చక్రవర్తి

అన్నవరం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్‌ఎన్ చక్రవర్తి తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. వారికి ఆలయం వద్ద పండితులు ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించిన అనంతరం పండితులు వేదాశీస్సులు, ప్రసాదాలను ఏఈఓ కృష్ణారావు అందజేశారు.



జనసంద్రంగా మారిన జగ్గన్నతోట ప్రభల తీర్థం



జగ్గన్నతోటలో కౌశిక దాటుతున్న జి.అగ్రహారం ప్రభ

హరివిల్లుల కొలువు

- జనసంద్రమైన జగ్గన్నతోట
- బారులు తీరిన భక్తులు
- కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్
- ఘనంగా కొత్తపేట ప్రభల తీర్థం



పి.గన్నవరం మండలం కుందాలపల్లి డ్యామ్ సెంటర్‌లో కొలువుదీరిన ప్రభలు



పంట పొలంలో నుంచి జగ్గన్నతోట వస్తున్న గంగలకుర్రు ప్రభ

సాక్షి అమలాపురం/కొత్తపేట/అంబాజీపేట: నింగిన ఇంద్రధనస్సులు కనిపించడం అరుదు. అప్పుడప్పుడూ కనిపించి కనువిందు చేసే ఆ ఇంద్రధనస్సులే మన కళ్లముందు నడయాడితే ఎంత అద్భుతంగా ఉంటుందో కదా! సంక్రాంతి సందర్భంగా కోనసీమలో జరిగిన ప్రభల తీర్థాలలో కొలువు తీరిన రంగురంగుల ప్రభలు.. కళ్ల ముందు నడయాడే ఇంద్రధనస్సులా ముచ్చటగొల్పాయి. పచ్చని ప్రకృతి ఒడిలో రంగురంగుల సీతాకోక చిలుకల్లా 'ప్రభ'లు సందడి చేశాయి. మకర సంక్రాంతి.. కనుమ.. ముక్కనుమ సందర్భంగా పచ్చని కోనసీమలో ప్రభల తీర్థాలు జరుగుతాయి. ఊరువాడా జరిగే ఈ తీర్థాలు సోమ, మంగళవారాల్లో అంబరాన్ని తాకాయి.

దేశంలో పేరు ప్రఖ్యాతులు పొందిన జగ్గన్నతోట తీర్థం.. వరద గోదారిలా పోటెత్తిన భక్తులతో జనసంద్రమే అయ్యింది. మిగిలిన తీర్థాల వద్ద కూడా జనం బారులు తీరారు. తీర్థం ఎక్కడైనా.. జనమే.. జనం అన్నట్టు పరిస్థితి కనిపించింది. వందల మంది భక్తుల భుజస్కంధాలపై తరలివచ్చిన ప్రభలు.. పైరు పచ్చని సీమలో పట్టపగలే నక్షత్ర కాంతులను వెదజల్లాయి. భక్తుల ఓంకార నాదాలు.. ప్రభలకు వేలాడదీసిన జేగంటల శబ్దాలు.. ప్రభలు మోసేవారి అశ్శరభ.. శరభ నినాదాలతో జిల్లాలోని పల్లెల్లో ఆధ్యాత్మిక పరిమళాలు వ్యాపించాయి.

అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో మంగళవారం నిర్వహించిన ఏకాదశ రుద్రుల ప్రభల తీర్థానికి జనం పోటెత్తారు. సుమారు లక్షన్నర మందికి పైబడి భక్త జనం హాజరయ్యారని అంచనా. వీరి రాకతో జగ్గన్నతోట కిటకిటలాడింది. రహదారులపై జనం బారులు తీరారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. గత ఏడాది గణతంత్ర వేడుకలలో ఆంధ్రప్రదేశ్ శకటాన్ని ఏకాదశ రుద్రప్రభలతో అలంకరించి పరేడ్ నిర్వహించిన విషయం తెలిసిందే. దీంతో ఈ తీర్థానికి అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. ఈ కారణంగా తీర్థానికి భారీగా జనం వస్తారని అంచనా వేశారు. అయితే నిర్వాహకులు ఊహించిన దానికన్నా రెట్టింపు సంఖ్యలో జనం హాజరయ్యారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి జనం రాక మొదలైంది. తీర్థం జరిగే తోటతో పాటు చుట్టూ ఉండే కొబ్బరి తోటలు, వరి చేల గట్లు, రోడ్లు, పంట కాలువ గట్లు జనంతో నిండిపోయాయి.

ప్రభలు కౌశిక దాటిన తీరును జనం ఆసక్తిగా తిలకించారు. సంప్రదాయ వస్త్రధారణతో యువతులు ప్రభల అందాలతో పోటీ పడ్డారు. వృద్ధులు, యువకులు, మహిళలు అనే తేడా లేకుండా తీర్థానికి వచ్చారు. ప్రభల ఊరేగింపు సంప్రదాయ పద్ధతిలో సాగింది. వ్యాఘ్రేశ్వరం నుంచి వ్యాఘ్రేశ్వర స్వామి ప్రభ వచ్చినప్పుడు మిగిలిన ప్రభలను గౌరవ సూచకంగా ఒకసారి పైకి ఎత్తారు. తీర్థం జరిగే ప్రాంతం ఇసుక వేస్తే రాలనంత మంది జనంతో నిండిపోయింది. తీర్థ ప్రాంతానికి వచ్చే ఆరు ప్రధాన రహదారుల్లో జనం బారులు తీరారు. స్థానికులు, వారి బంధుమిత్రులే కాకుండా తీర్థం గురించి తెలుసుకుని వివిధ జిల్లాల నుంచి వందలాది మంది వెల్లువెత్తారు. హైదరాబాద్, విశాఖ వంటి ప్రాంతాల నుంచి యూట్యూబర్లు, చిన్నచిన్న చానల్స్ వారు సైతం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇదే మండలంలోని వాకలగరువు సరిహద్దు వద్ద జరిగిన తీర్థానికి వాకలగరువు, తొండవరం ప్రభలు 52 అడుగుల ఎత్తున చూపరులకు కనువిందు చేశాయి.

బాణసంచా కాల్పులతో మార్మోగిన కొత్తపేట

కొత్తపేట ప్రభల ఉత్సవం సోమవారం అంబరాన్ని తాకింది. ఇక్కడ ప్రభల తీర్థం 24 గంటల పాటు నిర్విఘ్నంగా సాగింది. పాత, కొత్తరామాలయం వీధుల వారు ఒకరి తరువాత ఒకరు తమ వీధుల ప్రభలతో భారీ ఊరేగింపుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ప్రాంగణాలకు వచ్చారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. పాత బస్టాండ్ సెంటర్ భారీ ఎత్తున నిర్వహించిన బాణసంచా కాల్పులతో హోరెత్తింది. ఇదే మండలంలో అవిడి డ్యామ్ గేట్ సెంటర్ వద్ద జరిగిన తీర్థానికి జనం బారులు తీరారు.

మామిడికుదురు మండలం కొర్లగుంటలో జరిగిన తీర్థంలో 12 ప్రభలు కొలువుదీరాయి. ఇక్కడకు సైతం ప్రభలు పంటచేలు, కాలువలు దాటుకుని వచ్చాయి. జనం రికార్డు స్థాయిలో తరలి వచ్చారు. కాట్రేనికోన మండలం చెయ్యేరు వద్ద జరిగిన ప్రభల తీర్థానికి సైతం జనం పోటెత్తారు. రావులపాలెం మండలం దేవరపల్లి, పి.గన్నవరం మండలం మానేపల్లి, నాగుల్లంక, పప్పులవారిపాలెం, ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి, ఎస్.కొత్తపల్లి, వాడపర్రు, సన్నవిల్లి, అమలాపురం మండలం సాకుర్రు గరువు, బండారులంక, అమలాపురం పట్టణంలో గనికమ్మ గుడి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, రాజోలు నియోజకవర్గ పరిధిలో మలికిపురం మండలం కేశనపల్లి, తూర్పుపాలెం, రాజోలు పొదలాడ, ముమ్మిడివరం మండలం పల్లిపాలెం, క్రాప చింతలపూడి, చెయ్యేరు, ఐ.పోలవరం శివారు పెదమడి, ఐ.పోలవరం మండలం గుత్తెనదీవి, కపిలేశ్వరపురం మండలాల్లో ప్రభల తీర్థాలు అంగరంగ వైభవంగా సాగాయి.

ఘనంగా కనుమ

జిల్లాలో కనుమ పండగ ఘనంగా జరిగింది. అచ్చమైన తమ పండగను రైతులు సంతోషంగా నిర్వహించుకున్నారు. తమ మకాంలను శుభ్రం చేసుకున్నారు. గుమస్తాలు, కూలీలకు కొత్త వస్త్రాలు ఇచ్చి సత్కరించారు. ధాన్యాన్ని రాశులు పోసి పూజలు చేయడంతో పాటు ఎడ్లను, ఎడ్లబండ్లను ముస్తాబు చేశారు. ఎడ్లబండ్లను ఊళ్లలో ఊరేగిస్తూ సందడి చేశారు. మరోవైపు ప్రభల తీర్థాలలో సైతం గూడెడ్ల బండ్లు సందడి చేశాయి. కార్లలో తిరిగే జమీందారులు, ఉద్యోగులు, వ్యాపారులు సైతం తమ ఇళ్ల వద్ద నుంచి కుటుంబ సమేతంగా ప్రభల తీర్థానికి ఎడ్ల బళ్ల మీద తరలివచ్చారు. కొబ్బరి చాపలతో తయారు చేసిన గూడెడ్లబండ్లను పలువురు తమ కెమెరాలు, సెల్‌ఫోన్‌లలో బంధించారు.

హనుమంతుని పూజిస్తే సర్వ దేవతలనూ పూజించినట్టే



సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): లంకా నగరాన్ని దగ్ధం చేస్తున్న హనుమంతుడు త్రిమూర్త్యాత్మకుడని, ఆయనను పూజిస్తే సర్వ దేవతలనూ పూజించినట్లేనని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. స్థానిక హిందూ సమాజంలో శ్రీరామాయణ ప్రవచనాన్ని 35వ రోజయిన మంగళవారం ఆయన కొనసాగించారు. 'ఈ లంకా మహా నగరాన్ని అగ్నికి ఆహుతి చేస్తున్న ఈ మహాత్ముడు సామాన్య వానరుడు కాడు. ఇతను మహేంద్రుడా, యముడా, వాయువా, వరుణుడా, అగ్నియా, సోముడా, రుద్రుడా, సూర్యనారాయణుడా లేక విష్ణుశక్తియే కదలి వచ్చిందా' అనే ఆలోచనలో రాక్షసులు పడ్డారంటూ లంకా దహన ఘట్టాన్ని కళ్లకు కట్టినట్టు వివరించారు. 'లంకలోని అన్ని ఇళ్లూ తగలబడుతున్నా, ఒక్క విభీషణుని ఇల్లు తగలబడకపోవడానికి హనుమ ఆ ఇంటికి నిప్పు అంటించకపోవడం ఒక్కటే కారణం కాదు. చుట్టుపక్కల ఇళ్లు తగలబడుతూంటే, ఆ ఒక్క ఇల్లు క్షేమంగా ఉండటానికి అగ్ని దేవుని సంకల్పమే కారణం. రావణుని కొలువులో విభీషణుని ధర్మనిష్ఠను హనుమ గమనించాడు. సర్వకాల సర్వావస్థల్లోనూ మానవుడిని రక్షించేది ధర్మమే, సెక్యూరిటీ కాదు' అని సామవేదం అన్నారు. రామాయణంలో రాముడు విష్ణుతత్వం, సీతమ్మ శక్తి తత్త్వం, హనుమంతుడు రుద్రతత్త్వమని చెప్పారు. హనుమంతుడు గదను ధరించినట్టు వాల్మీకి మహర్షి రామాయణంలో ఎక్కడా చెప్పలేదన్నారు. 'ఆయనకు గద ఎందుకు? కొండలను, మహా వృక్షాలను శత్రువులపై విసిరివేయగలడు హనుమంతుడు. తాపత్రయాగ్నిని తొలగించేది రామనామం. పాపనాశనం అయితేనే కానీ తాపత్రయాలు తొలగవు. తాపత్రయాగ్నిని తొలగించుకున్న వానిని భౌతికమైన అగ్ని ఏం చేయగలదు? సీతమ్మ తల్లితో వినయశీలునిగా మాట్లాడిన హనుమంతుడు తన పరాక్రమాన్ని లంకలో చూపాడు. అన్ని సమయాల్లో వినయమూ పనికి రాదు, వీరమూ పనికి రాదు. వీటిని ఆయా సందర్భాలను బట్టి ప్రదర్శించాలి' అని చెప్పారు. భారతీయులు శాంతిమంత్రం, శౌర్యమంత్రం కలవారేనని ఆయన అన్నారు. హనుమంతుని వధించరాదని అన్నకు విభీషణుడు చెప్పిన తీరునుబట్టి, శాస్త్ర పాండిత్యం మన ప్రవర్తనలో కనపడాలని సామవేదం చెప్పారు.

వైభవంగా సత్యదేవుని ప్రభోత్సవం



అన్నవరంలో సాగుతున్న సత్యదేవుని ప్రభోత్సవం

అన్నవరం: కనుమ పండగ సందర్భంగా స్థానిక చినరావి చెట్టు వద్ద ఉన్న పురగిరి క్షత్రియ కులస్తుల రామకోవెల వద్ద సత్యదేవుని ప్రభోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, క్షేత్ర పాలకులు సీతారాముల ఉత్సవ మూర్తులను రత్నగిరి నుంచి పల్లకీల మీద ఊరేగింపుగా రామకోవెల వద్దకు తీసుకువచ్చారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు రామకోవెల ధర్మకర్త సోము జోగురాయుడు కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. రామకోవెలలో రెండు ప్రత్యేక ఆసనాలపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని, సీతారాములను పండితులు వేంచేయించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సర్వాంగసుందరంగా అలంకరించిన ప్రభ మీద స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి, రాత్రి 7.30 నుంచి 9 గంటల వరకూ గ్రామంలో మేళతాళాలు, కోలాట నృత్యాలతో ఘనంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థానం వేద పండితులు ముష్టి కామశాస్త్రి, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, ఉప ప్రధానార్చకుడు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, పరిచారకులు ముత్య వెంకట్రావు, గాడేపల్లి పవన్, స్పెషల్ గ్రేడ్ కల్యాణ బ్రహ్మ చామర్తి వేంకటరెడ్డి పంతులు (కన్నబాబు) తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నాద స్వర సంగీతం, తప్పెటగుళ్లు, కోలాటం భక్తులను అలరించాయి. గత నెల 16 నుంచి నిర్వహిస్తున్న సత్యదేవుని ధనుర్మాసోత్సవాలు ఈ ప్రభోత్సవంతో ముగిశాయి. ఈ నెల రోజులూ సత్యదేవుడు, అమ్మవారిని గ్రామంలో ఘనంగా ఊరేగించారు. తమ ఇళ్ల ముంగిటకు వచ్చిన స్వామి, అమ్మవార్లకు గ్రామస్తులు నివేదనలు సమర్పించారు. ధనుర్మాసోత్సవాలు వైభవంగా నిర్వహించిన దేవస్థానం వైదిక సిబ్బందికి, అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

సురక్షతో సుఖీభవ

- కొనసాగుతున్న రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష
- నిర్విరామంగా ఆరు నెలల పాటు నిర్వహణ
- స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు
- ఇంటికే ఉచితంగా ఖరీదైన మందులు హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కాతేరు గ్రామ సచివాలయం-2లో మందులు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు (ఫైల్)



రోగులకు సేవలందిస్తున్న వైద్యులు

జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరాల వివరాలు


ఇప్పటి వరకూ జరిగినవి	49
జనరల్ ఓపీ సేవలు పొందిన వారు	20,127
కంటి వెలుగు పరీక్షలు చేయించుకున్న వారు	1,045
మందులు తీసుకున్న వారు	20126
ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేసిన వారు	102

రాజమహేంద్రవరం రూరల్: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఎప్పుడూ లేని విధంగా స్పెషలిస్టు వైద్యులను గ్రామాలకు పంపించి వైద్య పరీక్షలు నిర్వహించడంతో ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అదే స్ఫూర్తితో ప్రస్తుతం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆరు నెలల పాటు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 368, పట్టణ ప్రాంతాల్లో 119 వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం జూన్ నెలాఖరు వరకూ ఆరు నెలల పాటు కొనసాగేలా ప్రణాళిక రూపొందించారు. దీనికి అనుగుణంగా స్పెషలిస్టు వైద్యులను, వైద్యాధికారులను నియమించారు.

జీవనశైలి వ్యాధులపై ప్రత్యేక దృష్టి

జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 శిబిరాల్లో జీవనశైలి వ్యాధులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. రక్తపోటు, మధుమేహం, హైపోథైరాయిడ్, రక్తహీనత, గర్భకోశ వ్యాధుల వంటి వాటిపై ప్రత్యేకంగా ఫోకస్ పెడుతున్నారు. అలాంటి వారిని గుర్తించి స్పెషలిస్ట్ వైద్యులతో చికిత్స అందిస్తున్నారు. అవసరమైతే మందులు ఇంటికే తీసుకుని వెళ్లి అందిస్తున్నారు. రోగులు క్రమం తప్పకుండా మందులు వాడేలా అవగాహన కల్పిస్తున్నారు. నిర్లక్ష్యం చేస్తే ఎదురయ్యే సమస్యలు వివరిస్తున్నారు. మొదటి విడతలో జీవనశైలి వ్యాధులున్నట్టు గుర్తించిన వారు రెండో విడత శిబిరాలకు వచ్చి పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకుంటున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు గుండె, కిడ్నీ జబ్బుల వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారు వస్తే, వారికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు, వారు గతంలో వాడుతున్న మందులు అందించే ఏర్పాట్లు చేశారు. శిబిరంలో అందుబాటులో లేని మందులను సీడీఎస్ యాప్‌లో నమోదు చేసి, రోగి పేరు, చిరునామా తెలియజేస్తూ, నేరుగా పోస్టు ద్వారా వారి ఇంటికే చేరేలా ఏర్పాటు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఖరీదైన మందులు సైతం పోస్టు ద్వారా ఇంటికే చేరుతూండటం విశేషం.

స్పందన బాగుంది



జిల్లాలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతంగా నిర్వహిస్తున్నాం. స్పెషలిస్టు వైద్యులే గ్రామాలకు వచ్చి పరీక్షలు చేస్తూండటంతో ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. వారికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేస్తున్నాం. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, హైపోథైరాయిడ్ వంటి వ్యాధులున్న వారు రెగ్యులర్‌గా మందులు వాడేలా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, వైద్యాధికారులు పాల్గొంటున్నారు.

– డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి

కంటి పరీక్షలు చేయించుకున్నా



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి పరీక్షలు చేయించుకున్నాను. కంటి అద్దాలు పడతాయని వైద్యులు చెప్పడంతో పాటు, కళ్లజోడు కూడా ఇచ్చారు. ఇప్పుడు కంటిచూపు బావుంది. ఈ వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

– ఇళ్ల లక్ష్మీనారాయణ, కంచర్ లైన్, ధవళేశ్వరం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మామిడికుదురు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పి.గన్నవరం మండలం మానేపల్లికి చెందిన మొల్లేటి చంద్రశేఖర్ (23) సోమవారం మృతి చెందాడని నగరం హెచ్‌సీ బి.కొండబాబు మంగళవారం తెలిపారు. రాజోలు మండలం పొన్నమండలో అక్క ఇంటికి వెళ్లి బైక్‌పై వస్తూ ఆదివారం రాత్రి మామిడికుదురు షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. అతన్ని అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందాడన్నారు. మృతుని అన్న మొల్లేటి రవిసత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

రైలుఢీకొని గుర్తు తెలియని వ్యక్తి...

నిడదవోలు : టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో మంగళవారం రైలుఢీకొని గుర్తుతెలియని 45 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడు. తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై ఎ. శ్రీహరిబాబు తెలిపిన వివరాల మేరకు రైల్వేట్రాక్‌పై సికింద్రాబాద్ నుంచి బ్రహ్మపూర్ వెళ్లే బ్రహ్మపూర్ సంక్రాంతి స్పెషల్ రైలు ప్రమాదవశాత్తూ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడు లైట్ ఆరంజ్ కలర్ ఫుల్ హ్యాండ్స్ చొక్కా, ముదురు గ్రే కలర్ కాటన్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై శ్రీహరిబాబు తెలిపినారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9490617090, 7013360296 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

సీటొస్తే నవోదయమే

- ఉజ్వల భవిత..ఉన్నత ప్రమాణాలు
- 20న నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 35 కేంద్రాల్లో హాజరు కానున్న 8,506 మంది విద్యార్థులు
- ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహణ



జవహర్ నవోదయ విద్యాలయ

జిల్లాల వారీగా పరీక్షా కేంద్రాలు, హాజరయ్యే విద్యార్థులు

జిల్లా	పరీక్షా కేంద్రాలు	దరఖాస్తు చేసిన విద్యార్థులు
కోనసీమ	15	3,548
తూర్పుగోదావరి	07	1,521
కాకినాడ	15	3,437

రాయవరం/పెద్దాపురం: ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య, క్రీడలు, సాహసకృత్యాలు, పౌష్టికాహారంతో పాటు వివిధ రంగాల్లో అధునాతన శిక్షణకు జవహర్ నవోదయ విద్యాలయాలు వేదికగా నిలుస్తున్నాయి. వీటిలో ప్రవేశాల కోసం ఏటా వేలాది మంది విద్యార్థులు పోటీ పడతారు. ఒకసారి 6వ తరగతిలో ప్రవేశం పొందితే +2(ఇంటర్) వరకు విలువలతో కూడిన ఉచిత విద్య లభిస్తుంది. నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20న జిల్లావ్యాప్తంగా పరీక్ష నిర్వహించనున్నారు.

8,506 మంది విద్యార్థులు

ఉమ్మడి జిల్లా పరిధిలో పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. 2024–25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. 80 సీట్లకు 8,506 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. కరోనా నేపథ్యంలో 2021లో 5,371 మంది విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోగా, 2022లో 10,741 మంది దరఖాస్తు చేసుకున్నారు. 2023లో 8,779 మంది దరఖాస్తు చేసుకోగా, ఈ ఏడాది 8,506 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ ఏడాది గతేడాది కంటే తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. పరీక్షల అనంతరం విద్యార్థుల ఓఎంఆర్ షీట్లను మూల్యాంకనం నిమిత్తం ఢిల్లీకి పంపిస్తారు. అక్కడే విద్యార్థుల ఎంపిక జరుగుతుంది.

80 ప్రశ్నలు..100 మార్కులు

ప్రశ్నపత్రంలో 80 ప్రశ్నలకు వంద మార్కులు కేటాయించారు. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కులు ఉంటాయి. మెంటల్ ఎబిలిటీలో 40 ప్రశ్నలకు 50 మార్కులు, గణితంలో 20 ప్రశ్నలకు 25 మార్కులు, భాష పరిజ్ఞానంలో 20 ప్రశ్నలకు 25 మార్కులు కేటాయించారు. విద్యార్థులు ఉదయం 10.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ఉదయం 11 గంటలకు పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించరు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుంది.

20న ప్రవేశ పరీక్ష

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పెద్దాపురం నవోదయ విద్యాలయంలో 80 సీట్లు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 15, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 15, తూర్పుగోదావరి జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే పరీక్ష నిర్వహణకు 37 పరీక్షా కేంద్రాల్లో అవసరమైన చీఫ్ సూపరింటెండెంట్లు, డీవోలు, ఇన్విజిలేటర్ల నియామకం చేపట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద అత్యవసర సమయంలో ప్రాథమిక చికిత్స అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలవుతుంది.

విద్యార్థులకు సూచనలివీ..

- విద్యార్థులు రెండు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.
- హాల్ టికెట్‌పై సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకం ఉండాలి.

ప్రధానోపాధ్యాయుడు సంతకం చేసిన ఒక హాల్ టికెట్‌ను ఇన్విజిలేటరుకు అందించాల్సి ఉంటుంది.

- బ్లూ లేదా బ్లాక్ పెన్నుతోనే పరీక్ష రాయాలి.
- పరీక్ష కేంద్రాలకు వచ్చే విద్యార్థులు పాఠశాల యూనిఫామ్, లేదా సివిల్ డ్రెస్‌లో హాజరు కావచ్చు.
- గంట ముందుగా విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.
- ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకురాకూడదు.
- మాస్కు, శానిటైజర్ తప్పనిసరిగా తీసుకురావాలి.

ఏర్పాట్లు పూర్తి



నవోదయ ప్రవేశ పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. దీనికోసం ఇప్పటికే ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులతో మాట్లాడాం. సీఎస్, డీవో, ఇన్విజిలేటర్ల నియామకం పూర్తయింది. సెంటర్ లెవల్ అబ్జర్వర్లను నియమించి శిక్షణ ఇస్తున్నాం.

– ఆర్.కమలం, ప్రిన్సిపాల్ జవహర్ నవోదయ విద్యాలయ, పెద్దాపురం.

పారదర్శకంగా నిర్వహిస్తాం



నవోదయ ప్రవేశ పరీక్షను పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలకు ఆదేశాలిచ్చాం. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.

– జి.నాగమణి, పాఠశాల విద్యాశాఖ, ఆర్‌జేడీ, కాకినాడ

ఆకట్టుకున్న మూడడుగుల ఎత్తు గిత్తల బండి


కేశనపల్లిలో ప్రధాన ఆకర్షణగా నిలిచిన మూడడుగుల ఎత్తు గిత్తల బండి, గుర్రాలు

మలికిపురం: మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన అడబాల నాని తన సంప్రదాయ మూడడుగుల ఎత్తు గల పుంగనూరు గిత్తల బండితో పాటు తన గుర్రాలపై గ్రామస్తులు ఎక్కి ఊరేగుతూ సందడి చేశారు. గ్రామంలో ఇవి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సంక్రాంతి పండుగ నేపథ్యంలో మంగళవారం గ్రామంలో ప్రభల ఊరేగింపు నిర్వహించారు. నీలపల్లాలమ్మ తీర్థం సందర్భంగా ప్రభలు, ఎండ్ల బండ్ల ఊరేగింపు నిర్వహించారు.

ఓం బసవేశ్వరాయనమః


బసవేశ్వరుడిని వంటకాలతో అలంకరించిన దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం బసవేశ్వరుడికి 108 పిండి వంటకాలను నివేదించి, అలంకరించారు. ఈ సందర్భంగా బసవేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. రాచపల్లి, పరిసర గ్రామాల నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పీఠాధిపతి స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

3 గ్రాముల బంగారంతో సూక్ష్మ ప్రభ


కొత్తపేటలో బంగారంతో రూపొందించిన సూక్ష్మ ప్రభ

కొత్తపేట: సంక్రాంతి ప్రభల ఉత్సవం సందర్భంగా కొత్తపేటకు చెందిన శ్రీవిద్యా జ్యూయలర్స్ సూక్ష్మ ప్రభ తయారు చేయించారు. మణి అనే స్వర్ణకారుడు లక్ష్మీగణపతి ప్రభను చాలా అందంగా రూపొందించారు. ఆ ప్రభను జ్యూయలర్స్‌లో ప్రదర్శించడంతో అటుగా వెళ్లేవారు ఆసక్తిగా తిలకించారు.


కొత్తపేటలో అయోధ్య ప్రభ

అయోధ్య ప్రభ

కొత్తపేట సంక్రాంతి ప్రభల ఉత్సవంలో అయోధ్య ప్రభ ఆకట్టుకుంది. ఈ నెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభం సందర్భంగా పాత రామాలయం వీధికి చెందిన ఒక ఉప ప్రభను విల్లు పట్టిన శ్రీరాముడు చిత్రంతో 'జై శ్రీరామ్, జయహో అయోధ్య' పేరుతో రూపొందించారు.

అల్లుడిగారికి వడ్డింపు!


365 రకాల వంటకాలతో కొత్త అల్లుడికి విందును ఇస్తున్న అత్తామామలు

రామచంద్రపురం రూరల్: మొదటి పండగకు వచ్చిన కొత్త అల్లుడికి అత్తవారింట ఇచ్చిన విందు అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. మండలంలోని ద్రాక్షారామకు చెందిన సమయమంతుల రాంబాబు మంగాతాయారు దంపతుల కుమార్తె లావణ్యను రామచంద్రపురం పట్టణానికి చెందిన కట్టమూరి ప్రసాద్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. కొత్త అల్లుడు సంక్రాంతికి ఇంటికి రావటంతో ఆయనకు పసందైన విందును ఏర్పాటు చేశారు. మొత్తం 365 రకాల వంటకాలను వడ్డించి నూతన దంపతులు లావణ్య, ప్రసాద్‌లకు అత్త మామలతో పాటుగా బావమరిది సుభాష్ దగ్గరుండి తినిపించారు.

చార్జీల బాదుడుపై కొరడా

- రవాణాశాఖ ప్రత్యేక డ్రైవ్
- నిబంధనల ఉల్లంఘనలపై కేసులు
- ఉమ్మడి జిల్లాలో 105 కేసులు, రూ.3.70 లక్షల అపరాధ రుసుం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సంక్రాంతి పండగను క్యాష్ చేసుకోవాలనుకునే ప్రైవేట్ ట్రావెల్స్‌పై రవాణాశాఖ కొరడా ఝుళిపిస్తోంది. సంక్రాంతికి వివిధ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వెళ్లే వారి సంఖ్య విపరీతంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ ఆపరేటర్లు బస్సులు నడుపుతుంటారు. ఈ బస్సుల్లో సాధారణం కంటే అధిక చార్జీలు వసూలు చేస్తుంటారు. ఏడాదికి ఒకసారి సంక్రాంతికి వచ్చే అధిక ఆదాయం వదులుకోలేక తగిన ధ్రువపత్రాలు లేకుండా, ప్రభుత్వానికి నిర్ణీత పన్నులు చెల్లించకుండా బస్సులను తిప్పుతుంటారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా అడ్డదారులు తొక్కే ప్రైవేట్ ట్రావెల్స్‌కు అడ్డుకట్ట వేయడానికి రవాణాశాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో ముఖ్యంగా లగేజీ రవాణా చేస్తున్న, ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నా కేసులు రాస్తున్నారు. బస్సు డాక్యుమెంట్లు, ట్యాక్స్ తదితర వాటిని పరిశీలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే రూ.వెయ్యి నుండి 10వేల వరకూ జరిమానా విధిస్తున్నారు. తెలంగాణ, కర్నాటక, తమిళనాడు నుంచి వచ్చే వాహనాలను ఊతకోట చెక్‌పోస్టు, దివాన్ చెరువు ,బెండపూడి చెక్‌పోస్టు వంటి ముఖ్య ప్రాంతాలలో తనిఖీలు చేస్తున్నారు. కాకినాడకు వచ్చే వాహనాల కోసం ప్రత్యేకంగా కరప మండలం నడకుదురు, సామర్లకోట ప్రాంతాలలో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ప్రతి రోజూ ఉదయంతో పాటు సాయంత్రం 6 నుంచి మర్నాడు 6గంటల వరకూ ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. ఇందుకోసం బృందాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా కాకినాడ జిల్లాలో ఇప్పటి వరకూ 20 కేసులు రూ.55,000 తూర్పుగోదావరి జిల్లాలో 50 కేసులు, రూ.1.30లక్షలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 35 కేసులు రూ.1.85 లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు.



వాహనాల తనిఖీతోపాటు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎంవీఐ హరినాథరెడ్డి

అధిక చార్జీలపై ప్రత్యేక డ్రైవ్



ముఖ్యంగా అధిక చార్జీలతో పాటు లగేజీ వంటి వాటిపై తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. ఉదయం, రాత్రి ప్రత్యేక బృందాలు ఈ నెల 16 వరకూ వారికి కేటాయించిన ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించాయి. కాకినాడ నుంచి వెళ్లే వాహనాలతోపాటు వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాం.

–ఎ.మోహన్, జిల్లా రవాణాశాఖాధికారి, కాకినాడ జిల్లా

నేడు కబడ్డీ జట్ల ఎంపిక

సామర్లకోట: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనడానికి ఉమ్మడి జూనియర్ జిల్లాకు బాలుర, బాలిక కబడ్డీ జట్లను బుధవారం ఎంపిక చేస్తామని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి వెంకట్‌రెడ్డి, కార్యదర్శి సీహెచ్ మణి వీరకంత, సెలెక్షన్ ఆర్గనైజరు ఉబా జాన్ కెనడీ తెలిపారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 23 వరకు నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేస్తామన్నారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగే జిల్లా కబడ్డీ టీముల ఎంపికకు బాలురు 70 కేజీల లోపు, బాలికలు 60 కిలోల లోపు బరువు కలిగి 04-02-2004 తరువాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. కబడ్డీ సెలెక్షన్ మ్యాట్‌పై జరుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని క్రీడాకారులు మ్యాట్ షూ ధరించి రావాలన్నారు. ఇతర వివరాలకు పోలారావును 9676664121 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

డ్రెయిన్‌లోకి దూసుకుపోయిన కారు

- మరో కారుని ఓవర్ టేక్ చేస్తుండగా అదుపు తప్పిన వైనం
- ఐదుగురు సురక్షితం

అల్లవరం: కొమరగిరిపట్నం నుంచి అంతర్వేది వెళ్తున్న కారు మరో కారుని ఓవర్ టేక్ చేస్తున్న సమయంలో అదుపుతప్పి కుమ్మరికాలువ డ్రెయిన్‌లోకి బోల్తా పడిందని డీఎస్పీ అంబికాప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలు, ఇద్దరు యువకులు సురక్షితంగా ఉన్నారని ఆయన తెలిపారు. గుడ్డివానిచింత సమీపంలో చర్చి ఎదురుగా సోమవారం ఉదయం జరిగిన ప్రమాదం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. కొమరగిరిపట్నం నుంచి రెండు కార్లు బయలుదేరాయి. గుడ్డివానిచింత సమీపంలో వచ్చే సరికి ఆకుల సుధాకర్ తన కారుని వేగంగా నడుపుతూ ముందున్న కారుని ఓవర్ టేక్ చేసి దానిని ముందు భాగంలో బలంగా ఢీకొట్టాడు. దీంతో కారు కుమ్మరికాలువలోకి ఎగిరిపడింది. ఈ కారులో ప్రయాణిస్తున్న ఆకుల సుధాకర్, ఆకుల సౌజన్య, ఆకుల లాస్యశ్రీ, గుర్రాల దివ్య, గుర్రాల శ్రీకాంత్ కారులో చిక్కుకున్నారు. మరో కారు రోడ్డు పక్కనే ఉన్న కంకరగుట్టను ఢీకొట్టి నిలిచిపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే కారులో చిక్కుకున్న వారిని ఆదే సమయానికి అటుగా వెళ్తున్న అల్లవరం ఎస్సై హరీష్‌కుమార్, స్థానికులు తలుపులను తొలగించి కాపాడారు.

ప్రమాదానికి గురైన కారులోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డ్రెయిన్‌లోకి బోల్తా పడిన కారుని క్రైన్ సహాయంతో బయటకు తీశారు. ఈ ఘటనపై ఎస్సై హరీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


ప్రమాదం జరిగిన తీరుని పరిశీలిస్తున్న ఎస్సై హరీష్‌కుమార్

వ్యవసాయ కూలీ సజీవ దహనం

దేవరపల్లి: స్థానిక బీసీ కాలనీలోని రేకుల షెడ్డులో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదంలో షెడ్డులో నిద్రిస్తున్న వ్యవసాయ కూలి సుంకర భీమరాజు(75) మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం మిర్తిపాడుకు చెందిన కరుటూరి భీమరాజు, భార్య నాగగనిక వ్యవసాయ పనుల నిమిత్తం దేవరపల్లి వలస వచ్చారు. సుమారు తొమ్మిది నెలల నుంచి స్థానిక రైతు నందిగం శ్రీధర్ పొలంలో పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శ్రీధర్ పొగాకు బ్యారన్ సమీపంలో ఎల్లిన బుల్లియ్య రేకుల షెడ్డులో ఉంటున్నారు. భీమరాజు మూడు రోజుల నుంచి విపరీతంగా మద్యం సేవించి భార్య నాగగనికను కొడుతున్నాడు. సోమవారం రాత్రి నాగగనికను కొట్టడంతో పక్కింటికి వెళ్లి పడుకుంది. రాత్రి 11.30 గంటల సమయంలో రేకుల షెడ్డులో నుంచి మంటలు రావడంతో చుట్టుపక్కల వారు చూసేసరికి మృతుడు మంటల్లో కాలిపోతున్నట్టు గమనించారు. అప్పటికే దట్టమైన మంటలు వ్యాపించడంతో భీమరాజు మంటల్లో చిక్కుకుని మృతి చెందాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించినట్టు భావిస్తున్నారు. భార్య నాగగనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. ప్రమాద స్థలాన్ని సీఐ కె.రామకృష్ణ, ఎస్సై శ్రీహరిరావు పరిశీలించారు.

ఆకట్టుకున్న గ్రీన్ ఆటో



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ నగరంలో మంగళవారం మొక్కల ప్రాధాన్యతను తెలుపుతూ డెకరేషన్ చేసిన ఆటో నగర ప్రజలను ఆకట్టుకుంది. విశాఖకు చెందిన డేవిడ్ అనే ఆటో డ్రైవర్‌కు గార్డెనింగ్ అంటే చాలా ఇష్టం అని అందుకే తన ఆటో చుట్టూ మొక్కలు ఏర్పాటు చేసి, టాప్ ఆర్టిఫిషియల్ గ్రీనరీతో నింపానని తెలిపాడు. సంక్రాంతి సందర్భంగా కాకినాడకు ప్యాసింజర్స్‌ను తీసుకువచ్చానని 'సాక్షి'కి తెలిపాడు.

బాస్కెట్‌బాల్ విజేతలు హైదరాబాద్, ఛత్తీస్‌గఢ్


ప్రథమ స్థానం సాధించిన మహిళల జట్టుకు ట్రోఫీని అందిస్తున్న డాక్టర్ వెంకట రమణ, స్టాలిన్ తదితరులు


ప్రథమ స్థానం సాధించిన పురుషుల జట్టుకు ట్రోఫీని అందిస్తున్న డాక్టర్ వెంకటరమణ, స్టాలిన్ తదితరులు

రామచంద్రపురం: కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో ఈ నెల 12 నుంచి 15 వరకు జరిగిన ఆలిండియా 13వ బాస్కెట్‌బాల్ పురుషుల, మహిళల పోటీలలో పురుషుల విభాగంలో ఆర్టిలరీ హైదరాబాద్ జట్టు, మహిళల విభాగంలో బిలాల్ స్టీల్స్ ఛత్తీస్‌గఢ్ జట్టు విజేతగా నిలిచాయి. ఓపెన్ కేటగిరిలో జరిగిన ఈ పోటీలను లీగ్ కం నాకవుట్ పద్ధతిలో నిర్వహించారు. కాగా పురుషుల విభాగంలో హైదరాబాద్ కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ జట్టు ద్వితీయ స్థానం, రామచంద్రపురం జట్టు తృతీయ స్థానం, హైదరాబాద్ డీబీఏ జట్టు నాలుగవ స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో రామచంద్రపురం జట్టు ద్వితీయ స్థానం, హైదరాబాద్ డిఫెన్స్ జట్టు తృతీయ, ఏలూరు జట్టు నాలుగవ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సత్యా స్కానింగ్ సెంటర్ అధినేత డాక్టర్ కాదా వెంకటరమణ, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్, ఆర్టోస్ అధినేత అడ్డూరి జగన్నాథ వర్మ, డాక్టర్ రామారావు, డాక్టర్ కవిత, డాక్టర్ కెవిన్ సతీష్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు విజేతలకు షీల్డ్, ట్రోఫీలను అందజేశారు.

ఏఎస్సైపై యువకుల దాడి.. కేసు నమోదు

కొత్తపేట: స్థానిక సంక్రాంతి ప్రభల ఉత్సవం సందర్భంగా విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై కళా శ్రీనివాసరావుపై కొందరు యువకులు దాడి చేసిన సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్టు ఎస్సై జ్వాలాసాగర్ తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 15న రాత్రి పాతరామాలయం వీధికి చెందిన ప్రభ వద్ద కొందరు గొడవ పడుతున్నారు. ఆ సమీపంలో విధులు నిర్వహిస్తున్న ఇంటిలిజెన్స్ ఏఎస్సైగా పని చేస్తున్న శ్రీనివాసరావు ఘటనా స్థలి చేరుకుని వీడియో తీస్తుండగా స్థానిక గోగివారిపేటకు చెందిన పల్లి శామ్యూల్ అనే యువకుడితో పాటు మరికొందరు వీడియో ఎందుకు తీస్తున్నారు? అని ప్రశ్నించి, విధులకు ఆటంకం కలిగించారు. అంతటితో ఆగకుండా ఏఎస్సైపై దాడిచేసి ముఖంపై పిడిగుద్దులు గుద్ది గాయపరిచారు. దాంతో ఏఎస్సైని సహచర పోలీసు సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జ్వాలాసాగర్ తెలిపారు.